క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎంఎం (ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్) అధికారిణి మమత అన్నారు. మండల పరిధిలోని దేవునిపడకల్‌లో ఉపాధిహామీ పనుల కింద చేపట్టిన చెరువు పూడికతీత పనులను సోమవారం స్టేట్ ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాసుతో కలిసి ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనిప్రదేశంలో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానిక నర్సరీని పరిశీలించారు. మొక్కల సర్వే, స్టాక్, జాబ్‌కార్డ్స్ తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ చరణ్ గౌతమ్, క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సిక్రియ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రామచంద్రయ్య, ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, టీఏ లతారాణి, సువర్ణ, తానయ్య, పంచాయతీ కార్యదర్శి జంగయ్య, ఎఫ్ఏ జంగయ్య, మేట్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూత్ కమిటీ ఎన్నిక

యాచారం: మండల కేంద్రంలో సోమవారం అంబేడ్కర్ యూత్ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గణేశ్, కోశాధికారిగా జంగయ్య, ప్రధాన కార్యదర్శులుగా వంశీ, రాజు, అధికార ప్రతినిధులుగా మహేష్, సలహాదారులుగా రమేష్, ఆనంద్, పవన్, అనిల్, సంజీవను ఎన్నుకున్నారు.

9న సామాజిక నివేదిక సభ

యాచారం: ఈనెల 9న మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ నివేదిక సభ నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గతనెల 29 నుంచి ఈనెల 8వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు, గ్రామ సభలు పూర్తిచేశామని తెలిపారు. ఈ క్రమంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక మండల నివేదిక సభ జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్: ఆమనగల్ పట్టణంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై కావటి పద్మమ్మ మృతి చెందింది. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీజేపీ సీనియర్ నేత ఆచారి తదితరులు పద్మమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి హామీ ఇచ్చారు.

పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించండి

మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి



తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కొహెడ, తొర్రూర్, మునగనూర్, బ్రాహ్మణపల్లి, తుర్కయంజాల్ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, టెంట్ హౌజ్ సామగ్రి, ఎలక్ట్రిక్ మరమ్మతుల విషయమై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కుంట్లూర్ సర్వేనంబర్ 101, 106తో పాటు తట్టిఅన్నారం సర్వే నంబర్ 26, 106లో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా ఆక్రమణదారులు పట్టించుకోకపోవడంతో సోమవారం ఆయా నిర్మాణాలను కూల్చివేయించినట్లు తహసీల్దార్ రవీందర్ దత్ తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, సిబ్బంది కూల్చివేత పనులను పర్యవేక్షించారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు

- నత్తనడకన గుర్లకుంటతండా బీటీరోడ్డు నిర్మాణ పనులు
- ఏడాది పూర్తయినా పూర్తికాని వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కంకర పోసి వదిలేసిన కడ్తాల్-గుర్లకుంటతండా రహదారి

కడ్తాల్: మండల పరిధిలోని గుర్లకుంట తండాకు వెళ్లేదారిలో ఏడాదిక్రితం బీటీరోడ్డు నిర్మాణం కోసం కంకరపోసి అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. కడ్తాల్ నుంచి గుర్లకుంటతండాకు వెళ్లాలంటే చెరుకట్ట నుంచే వెళ్లాలి. దీంతో ఈ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి 2022 ఏడాది చివర్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీఆర్ఆర్ నిధులు రూ.కోటి మంజూరు చేసింది. 2023 జనవరిలో అప్పటి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ కూడా చేశారు.

ఇబ్బందిగా ప్రయాణం..

ఈ క్రమంలో పనులు ప్రారంభించిన గుత్తేదారు రోడ్డుకు ఇరువైపులా షోల్డర్ వర్క్ పూర్తిచేసి కంకర వేశాడు. తదనంతరం పనులు అలాగే వదిలేయడంతో కంకర రోడ్డుపై ప్రయాణం చేయలేక వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు ఉన్నప్పుడే బాగుండేది అని, కంకర వేసి వదిలేయడంతో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారిందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని.. త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు అలుగు వద్ద కల్వర్టు నిర్మాణం కూడా చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



చెరువుకట్టపై కంకర వేసి వదిలేయడంతో అటుగుండా వెళ్లాలంటే భయమేస్తుంది. బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రాత్రివేళ బైక్‌పై బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయాలి.

– శంకర్‌నాయక్, గుర్లకుంట తండా, కడ్తాల్

అధికారులు పట్టించుకోవడం లేదు



తండాకు వెళ్లేదారిలో కంకరవేసి వదిలేయడంతో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నాం. రోడ్డు పనులు పూర్తిచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– హన్మానాయక్, గుర్లకుంటతండా, కడ్తాల్

రోడ్డు నిర్మాణం పూర్తిచేయండి



గతేడాది ఎండాకాలంలో పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదు. రెండు నెలల క్రితం కంకర పోసి వదిలేశారు. తండావాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– రాంచందర్‌నాయక్, గుర్లకుంటతండా, కడ్తాల్

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మల్లురవి, చామలకు మద్దతుగా నేతల ముమ్మర ప్రచారం



తలకొండపల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భగ్‌వాన్‌రెడ్డి, రేణురెడ్డి, ఇన్‌చార్జి ఇందిరా శోభన్, నాయకులు.. ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి వస్తాం..

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ జోస్యం చెప్పారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు కోరారు. సోమవారం పట్టణంలో మల్లురవికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు మల్లయ్య, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు మేలు

యాచారం: దేశంలో ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్ పేర్కొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు అంగోత్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తక్కళ్లపల్లి తండాలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. చేతి గుర్తుకు ఓటేసి భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు, మాజీఎంపీపీలువెంకటేశ్వర్లు, జ్యోతినాయక్, మాజీ వైస్ ఎంపీపీ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చామలను గెలిపించండి..

తుర్కయంజాల్: భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి చామల డింపుల్ రెడ్డి కోరారు. సోమవారం ఆమె పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితతో కలిసి ప్రచారం నిర్వహించారు. నాయకులు ధన్‌రాజ్ గౌడ్, శంకర్ గౌడ్, రవిశంకర్, గౌస్‌పాషా, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బూర'ను భారీ మెజార్టీతో గెలిపించండి

బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి



ఇబ్రహీంపట్నం: భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక లోక్‌సభ మహిళా మోర్చా ఇన్‌చార్జి ఎం.భాగ్యలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో బూరను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులతో కలసి ఆమె ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలకు రిజర్వేషన్లతోపాటు అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత బీజేపీదేనన్నారు. బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ నేతలు శ్వేత, అనిత, ఉమాగుప్తా, లలిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బూర గెలుపు ఖాయం..

యాచారం: భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. యాచారంలో సోమవారం ఆ పార్టీ నేతల ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ... దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని అన్నారు. అనంతరం భువనగిరిలో జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, నాయకులు యాదయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ముమ్మరంగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ఆమనగల్: రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. ఆమనగల్ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఐదునెలలు కావస్తున్నా హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని..లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు ఖలీల్, వెంకట్‌రెడ్డి, రమేష్‌నాయక్, శ్రీను, భాస్కర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఇంటి ప్రచారం..

ఆమనగల్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఆమనగల్ పట్టణంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్, రఘు, ప్రసాద్, యాదగిరి, శ్రీను తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కడ్తాల్: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మక్తామాధారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. జైపాల్‌యాదవ్ మాట్లాడూతూ.. రాష్ట్రంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. కారుగుర్తుకు ఓటు వేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ మంజుల, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సాయిలు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టండి

తలకొండపల్లి: కాంగ్రెస్, బీజేపీలను లోక్‌సభ ఎన్నికల్లో తరిమికొట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా మండల పరిధిలోని వెల్జాల్‌లో శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబుర్ రహ్మాన్, నరేందర్ గౌడ్, శ్రీకాంత్, యాదయ్య, శ్రీరామ్, అభిలాష్, సాయి, రాజు, జగన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

క్యామను గెలిపించండి..

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్యామను గెలిపిద్దాం..

మంచాల: కారు గుర్తుపై ఓటు వేసి భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎన్నికల పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ నర్మద, పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు చంద్రయ్య, సికిందర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్, రఘుపతి, జానీపాష, జగన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు భద్రీనాథ్ పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఉపాధ్యాయుడు

- పోగొట్టుకున్న బ్యాగును బాధితుల ఇంటికి వెళ్లి ఇచ్చిన వైనం



బ్యాగును అందజేస్తున్న ఉపాధ్యాయుడు జహీర్ ఆజాద్

మంచాల: భద్రంగా దాచుకున్న వస్తువులను దొంగిలిస్తున్న ఈ రోజుల్లో పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను ఇంటికి తీసుకెళ్లి మరీ తిరిగి ఇచ్చి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండల కేంద్రానికి చెందిన గ్యార కృష్ణ-స్వాతి దంపతులు తమ బంధువు అనారోగ్యానికి గురై ఇబ్రహీంపట్నంలోని ఓ వైద్యశాలలో ఉన్నారు. వారిని పరామర్శించి తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సీతారాంపేట్ గేట్ సమీపంలో రోడ్డుపై బ్యాగు పడిపోయింది. ఇది గమనించని దంపతులు ఇంటి చేరిన తరువాత బ్యాగు పోయిందని గుర్తించారు. అందులో మూడు తులాల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్నాయని తీవ్ర ఆందోళన గురవుతున్నారు. ఆరుట్ల గ్రామానికి చెందిన జహీర్ ఆజాద్, సుభాస్‌లు వృత్తి రీత్య ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇబ్రహీంపట్నం నుంచి ఆరుట్లకు బైకుపై వస్తుండగా వారికి బ్యాగు రోడ్డుపై దొరికింది. పరిశీలించగా అందులో బంగారు ఆభరణాలు, నగదుతో పాటు ఆధార్ కార్డు ఉంది. వెంటనే ఆధార్ కార్డు ఆధారంగా బాధితుల ఇంటికి వెతుక్కుంటూ ఆజాద్ వెళ్లారు. అప్పటికే తీవ్ర దుఃఖంలో ఉన్న వారికి మీ బ్యాగు దొరికిందని ఇచ్చారు. ఒక్కసారిగా ఆ దంపతుల కళ్లలో ఆనందభాష్పాలు రాల్చారు. వెతుక్కుంటూ బ్యాగును ఇచ్చి నిజాయతీని చాటుకున్న ఉపాధ్యాయుడిని స్థానికులు అభినందించారు.

1,024 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

ఇబ్రహీంపట్నం: భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సోమవారం వరకు 1,024 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని పోలీస్‌శాఖ ఉద్యోగులు, ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓ, ఓపీఓలు తమ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ విధానంలో శుక్రవారం నుంచి వినియోగించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందుకుగాను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 ఫెసిలిటేషన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటేసేందుకువారికి అవకాశం ఉంది. 3,581 ఓట్లకుగాను ఇప్పటి వరకు 1,024 ఓట్లు పోలయ్యాయి. ఈ పద్ధతిలో ఓట్లు వేసేందుకు బుధవారం వరకు అవకాశం ఉంది.

భాషా పండితులకు న్యాయం చేయాలి

తలకొండపల్లి: తెలుగు భాషా పండితులకు న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ పేపర్-2లో తెలుగు భాషా పండితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో తమకు సంబంధం లేని సాంఘిక శాస్త్రం అంశంలోని బోధనా పద్ధతుల ప్రశ్నలు ఇస్తున్నారని, మాకు అర్థం కాని సబ్జెక్టు కావడంతో మార్కులు సాధించలేక పోతున్నామని ఆయన వాపోయారు. తద్వారా డీఎస్సీలో వేయిటేజి తగ్గి తెలుగు ఉపాధ్యాయులుగా స్థిరపడాలనుకునే తమ లక్ష్యాన్ని సాధించలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన సిలారి, గానుగుమార్లతండాకు చెందిన బద్యానాయక్, మండల కేంద్రానికి చెందిన రాములమ్మ, మద్రిపల్లికి చెందిన మహేశ్ ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, స్థానిక ఎంపీటీసీ ప్రియా రమేశ్ సోమవారం పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు ఉన్నారు.

కళాకారులకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఇటీవల చిరుతల మహాభారతం స్టేజి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ సోమవారం కళాకారులను ఘనంగా సన్మానించి వారికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అడ్వకేట్ ఆంజనేయులు గౌడ్, నిరంజన్, మల్లేశ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి..

తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన బైరపాక పరశురాం రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండ ఎన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం పరశురాములును మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ సర్పంచ్ లలిత పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్టు తరఫున బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.50వేలు అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, సాయిలు, వెంకటేష్ పాల్గొన్నారు.

నేను ఓటేశా.. మీరూ వేయండి



సెల్ఫీ పాయింట్ వద్ద ఎస్ఐలు రాజు, వెంకటేష్

ఇబ్రహీంపట్నం రూరల్: ఓటుహక్కు వినియోగంపై ఎన్నికల కమిషన్ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఇబ్రహీంపట్నంలో 'ఐ ఓటు ఫర్ ష్యూర్' అనే నినాదంతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన కూడళ్ల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం భారీ సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఆదిబట్ల ఎస్ఐలు వెంకటేశ్, రాజు సెల్ఫీ పాయింట్ వద్ద 'మేము ఓటు వేశాము.. మీరూ వేయండి' అంటూ వినూత్న అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్ నేతల బాహాబాహీ

ఆమనగల్: ఆమనగల్ పట్టణంలో సోమవారం బీఆర్ఎస్ నేతలు బాహాబాహీకి దిగారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి సోమవారం ఉదయం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రావడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దోనాదుల కుమార్ మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోలేపల్లి గ్రామానికి అర్జున్‌రావు రావడం పట్ల, అదే గ్రామానికి చెందిన దోనాదుల కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఆమనగల్ పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు జైపాల్‌యాదవ్, నాయకులు చేరుకున్నారు. అక్కడ మరోసారి అర్జున్‌రావుకి, దోనాదుల కుమార్‌కి వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇరువురు నాయకులు దూషించుకుంటూ, ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కొట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇరువురిని సముదాయించి తన వాహనంలో తీసుకుపోవడంతో సద్దుమణిగింది.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి చందనవెళ్లి గ్రామంలో ఉప్పల మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను నిర్వాహకుడు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో జోగిని శ్యామల పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు బుచయ్య, రవికుమార్, మహేందర్‌గౌడ్ ఉన్నారు.

9 నుంచి బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయం 28వ బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 15 వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాల కన్నుల పండుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి జగన్, కోశాధికారి అయిత అంజయ్య తదితరులు పాల్గొన్నారు.